సిర్ సిరా

—షాజహానా

''సెల్లె, గరీబుదాన్నంయితె. అయినగని, ఇంటికొచ్చిన సుట్టాన్ని అప్పుదెప్పయిన పానం తీర్గ జూసుకుంట గాదె, గీ ఎండాకాలం సెల్వలనన్న మున్నిని పంపరాదె, ఆడ పొల్లలు లేకపోతిరి, నాల్గు దినాలుంచుకోని పువ్వో, పత్రో తెచ్చిపెట్టి పంపిస్త...' అని 'అయిన నా దివానతనం గానీ మా గరీబిళ్ళకు మీ దొరసాన్లసొంటి బిడ్డలొస్తరా...ఐతెపాయెలె సెల్లె మరి నేనొస్త మల్ల ఎన్నాల్లకొ కండ్లజూసేది' అని ఏడ్సుకుంట మా అమ్మీ యాకుబ్బీని కౌగిలించుకొని నెత్తిన బెట్టిన మందార పువ్వుని గట్టిగ లోపలికి దోపుకుని ముక్కు-చీది చీరకొంగుతో తుడ్సుకుంట ఎనక్కె-నక్కి సూసుకుంట ఎర్రబడ్డ కండ్ల తోని ఎల్లిపోయింది కరీంబి బడెమ్మ.

డిగ్రీ కొచ్చి ఇంత మటుకి ఎప్పుడు సెలవులిచ్చినా మా అబ్బవేపు వాళ్ళిళ్ళకే ఎల్లిన గని అమ్మీ వేపు వాళ్ళిళ్ళకు ఎల్లనే లేదు. ఎప్పుడో ఎల్లినగని గుర్తే లేదు. యీ ఎండాకాలం సెలవులల్ల ఎట్లయిన కరీంబి బడెమ్మింటికి పోవల్నని గట్టిగ అనుకున్న. ఈడొచ్చిన ఆడపొల్లను తోడు లేకుంట ఏడికి పంపియ్యని వీళ్ళ భయానికి ఇరుగుడాలోచించి మా తమ్మున్ని గూడ తీసుకెళ్ళాల్నను కున్న. ఆమాటే మా అమ్మీతో అనంగనె ఆమె ముఖం పెరట్లో పూసిన ముద్ద బంతి పువ్వులా కళకళలాడింది. మా అబ్బా ఏం మాట్లాడలే.

మా అమ్మీ ముఖం ఎలగడానికో కారణముంది. మా బడెమ్మ జుట్టుకు సవరమేసి, కాయితపూలు బెట్టుకొని, మోటుగ మాట్లాడుకుంట, మాసిన బట్టల్లోటి, మద్దెమద్దెల శోకాలు పెట్టుకుంట, ముక్కు చీది ఏడబడితె ఆడ రాసుకుంట ఉంటదని మా ఆపాగానీ, భాయి గానీ బడెమ్మొచ్చిందంటే కొద్దిగ కంపరంగుంటరు. పోయిందాన్క ఊపిరి తీసుడు కష్టంగ తీస్తరు. పోయినంక ఫ్రీగ మాట్లాడుకుంట ఆమె మాటల్ని ఇమిటేట్ చేస్కుంట, నవ్వుకుంట ఆమె పండుకున్న చద్దర్లని ఉతకిందాన్క నిద్ర పోకుంట, గిట్ల ఉంటరు.

మా బడెమ్మోళ్ళు గీడ కొస్తెనే ఊపిరాడకుంటయితే ఈళ్ళుగిన ఆడికి బోతె పూరాపానం ఎగిరేపోద్ది. గందుకే నేను అల్లూరు పోతననంగనే మా అమ్మీ గంతగనం ఖుష్షయింది. మా ఆపా, భాయి, నాకెల్లి వింత వస్తువని జూసినట్లు చూసి మాకేందిలే అని గమ్మునున్నరు. మా తమ్మునికి నేనంటే శానా ఇష్టం. నేనేం జెప్తే గదే ఇంటడు. వయసుల పెద్ద తేడా లేనందున ఇద్దరం అన్నీ కల్సే చేస్తం. 'ఊరి కొస్తావురా' అనడగంగనే 'వస్తానాపా' అన్నడు.

సెలవులు రానె వచ్చినయ్. బట్టలు గిట్ల అన్ని సర్దుకుని మేం బయల్దేరినం. మా అబ్బా చెప్తుండె, 'తుమ్హారా బడెబ్బ సేందీ మంగాయేంగే-మగర్ పియే బోల్కే మాలూమ్ హోనా...మార్ దాలూంగా దోనోంకో!' అని. మెల్లంగ తలలూపి బయట వడ్డం, తెల్లవారు మూడింటికి బస్టాండ్‌కు బయల్దేరినం. అడ్నించి కొత్తగూడెంకు బస్సుంది. ఆ బస్సు నిండా సింగరేణికి పొయ్యేటోల్లే ఉంటరు. నాలుగున్నర కల్లా రైల్వేస్టేషన్లుంటిమి. ఐదింటికి రైలొచ్చి ఆరింటికి బయల్దేరింది. తొమ్మిదింటికి కేసముద్రం స్టేషన్ల ఆగింది.

ఇద్దరం రైల్దిగి స్టేషన్ల నుండి బయటికొచ్చినం. ఉప్పరపల్లి బస్సు గురించి ఎంక్వైరి చేస్తే పన్నెండు గంటలకు బస్సుందన్నరు. అప్పటి దాన్క ఎందుకుండాల్నని ఆటోలోల్లనడిగితే స్పెషల్‌గ నయితే ముప్పయి రూపాలన్నడు. అందర్నెక్కిస్తే మూడు రూపాలన్నడు. అందర్నంటే పది పదిహేన్మందైనెన ఎక్కిస్తడని పక్కన పోతున్న ఆటోని చూస్తే సమజయి మా తమ్ముడు 'ఆపా! స్పెషల్‌గనె పోదా' మన్నడు.

ఇరవయ్యైదు రూపాలిచ్చి పావుగంటల ఊర్లొదిగినం. దిగనయితె దిగినం గని దారి తెల్వదాయె. మా తమ్ముడు దార్ల పొయ్యేటి ఒకాయన్ని పిల్చి 'లతీఫ్ గారిల్లెక్కడండీ?' అనడిగిండు. ఆయనకర్థం గాలె. 'మల్లజెప్పయ్యా' అన్నడు. మల్లమల్ల చెప్పినా సమజ్‌గాలె. గప్పుడు అమ్మీ జెప్పిన మాటలు యాద్కొచ్చి,

'అదిగాదె తాత...దూదేకుల లత్తయ్య ....దూదేకుల కరీంబీ వాల్లు లేరూ...గదెనే సన్నాయి లత్తయ్య...గాల్లిల్లు' అన్న.

'ఓర్నీ...దూదేకుల లత్తయ్యం టికా... రారీ..తొవ్వ సూపిత్త..' అని 'మీరేం గావాలె అల్లకు' అనడిగిండు తాత.

'కరీంబీ చెల్లె బిడ్డని..ఈడు మా తమ్ముడు' అన్న.

'గిదే అనుకుంట మొందాలు రాక..కరీంబీ ఎప్పుడు మీ గురించే చెప్తది, ఇసుగు లేకుండ. ఇయాల్రేపు పండుగే కరీంబీకి. నాల్దినాలుంటారు బిడ్డా....అయినా గీ పల్లెటూల్ల ఏం ఉంటర్లే తియ్...ఒక్క పూట, రెండు పూటలుండుడే గగనం' తనకి తనే చెప్పుకుంట నడుస్తుంటే మేం ఎనకనే సందులు గొందులు తిరుక్కుంట ఇల్లు జేరినం.

'కరీంబీ..ఎవల్లొచ్చిన్లో సూడవూ...' పెద్దగా కేకబెట్టిండు తాత.

ఇంట్ల నుంచి బయటికొచ్చి కళ్ళు పెద్దగ జేసి దగ్గర్కొచ్చి చేతులు, ముఖం అంతా తడిమి ఒక్కసారి పెద్ద పెట్టున ఏడవబట్టింది మా బడెమ్మ. 'ఇన్నాల్లకు కాల్లొచ్చినయా బిడ్డా..మీ బాపుకు గిప్పుడైన దయబుట్టె బిడ్డా...అల్లకు రాబుద్ధయితలే బిడ్డా..మేం ఉన్నోల్లమైతే వద్దురేమో బిడ్డా..మా చెల్లె ట్లున్నదే బిడ్డా..' సాగుతూనే ఉంది ఏడుపు. ఇంటి పక్క మాదిగోళ్ళు, ఇంటెనక గౌండ్లోళ్ళు, పక్కనే పాలోళ్ళు అందరు గుమి గూడిన్రు వాకిట్ల.

'ఎవలె...ఎవలె..?' ఎవరో అడుగుతుంటె మమ్ముల తీసుకొచ్చిన తాత 'కరీంబి చెల్లె పాలెంచల ఉండదీ, గావె బిడ్డ కొడుకు' అని చెబుతుండు.

'కరీంబీ! ఇగ ఏడ్చింది సాల్లే గనీ అల్లనింట్లకు తీస్కపో! బిడ్డలు బిక్కమొగాలేసిన్రు. వస్తర్లే, రాకేడికి బోతరు నీ చెల్లె మరిది నువ్వు బోతేంది అల్లొస్తేంది గనీ..అల్లకేమో గీ పల్లెటూల్లకు రాబుద్ధయితలే, ఏం చేస్తవ్‌లే...కాల్లకు నీల్లు గిట్లియ్యి...' మాదిగోల్లవ్వ పెద్దగ మందలిచ్చినట్లనే సరికి గబగబా సూట్‌కేసందుకుని ఇంట్ల బెట్టి కాళ్ళకు నీళ్ళిచ్చి సందుగుల నుంచి తువ్వాలు తీసి తడుచుకుందికిచ్చింది బడెమ్మ. ఇద్దరం తుడ్చుకునేసరికల్లా కాయితపూల చెట్టు కింద మంచ వేసి బొంతేసి కూసాబెట్టింది, కింద చతికిలబడి. 'మా యాకూబ్బీ బాగున్నాదే. తీస్కరానంట్రి సెల్లెని..గింత కల్లు బొట్టన్నా తాగిపొయ్యేటిది. ఎన్ని దినాలాయె మాకేలి రాక' అన్నది దిగులుగా బడెమ్మ.

'ఇంటి గురించి తెల్సుగా బడెమ్మ, అందర్కీ రానీకి కుదర్దాయె' అని గునిగిన. బడమ్మేం మాట్లాడలె. 'కూసు నుంర్రి గిప్పుడే వొస్త బిడ్డా...' అని గబ్బగబ్బ ఇంట్లకు బొయ్యి బస్తాడొడ్ల నెత్తినేసుకుని బయటకు బొయ్యి పావుగంటైనక చేతులిన్ని టమాటలు, కోడిగుడ్లతోని తిరిగొచ్చింది.



వడ్ల మ్మి గయన్ని కొనుకొచ్చిందని సమ్జయి ఏమూలో కలుక్కుమనిపిచ్చి గామాటే బడెమ్మ తోటి అంటే 'ఇగ సాల్లే బిడ్డా రాక రాక పానమసొం టోల్లొచ్చిన్రు, గిదిగూడ లెక్కేనా... ఆగరాది-మీ బడె బాపు రాంగనే రేపు ఎల్లుండి మస్తుగ చేపల్దెప్పిస్త. గీడ సెర్వుల బాగ దొరుకుతయి. నాటుకోళ్ళు ఇంట్లనే ఉండె. గీ రాతిరి వస్తడమో బడె బాపు' అన్నది బడెమ్మ.

వచ్చేటప్పుడు గౌండ్లాయనకు చెప్పిందేమో మాకేలి చిత్రంగ చూసుకుంట రెండు లొట్ల నింద కల్లు తీస్కబోయి ఇంట్ల బెట్టిండు.

'ఎవలే కరీవక్క' అన్నడు.

'మా పెద్ద సెల్లె బిడ్డ, కొడుకు..పాలెంచ' అని 'ఓ తమ్మి, సెల్వలనొచ్చిన్రు, ఉన్నన్ని దినాలు, మంచి కల్లు బొయ్యాలే' అన్నది.

నాకు చచ్చే సిగ్గయింది, మేం కల్లు తాగుమని అందరెక్కడనుకుంటరో అని.

'ఇంతకీ పెంటు, గోరిమియా లెక్కడున్నరు' అనడిగిన, ఇంత సేపటిదాన్క వాళ్ళనడగనందుకు కొద్దిగ నొచ్చుకుంట.

'పెంటు గాడేమో సదూకోరా నీ బాంచెను, మేం అమ్ముడు బొయ్యేనా సదిపిస్తంరా అంటే ఇనక కేసంద్రం టేషన్ల సీన్మాలు మరిగి సదువ పాడుజేసిండు. గిప్పుడు అయ్యెంబడి గజ్జెలు కొట్టబొయ్యి-గట్లనె సన్నాయి వాయించుడు గూడ నేర్సిండు గదూ! అన్నీ అయ్య బుద్దులె, తాగుట్ల గూడా! గోరె గాడేమో ఎనిమిదిల బడ్డడు. పస్తున్నాలె, పోరడు ఇస్కూలికయితే మాగ బోతడు, వానికి రంగు రంగుల అంగీలు గావాలే, బూట్లు గావాలే, గిప్పుడు సైకిలు గావాల్నని సతయిస్తుండు....ఏ మెచ్చుల పోరడు...' బడెమ్మ చెప్తుంటెనే గోరెమియా గబ్బగబ్బ వచ్చి మమ్మల్ని జూసి పళ్ళికిలించి 'ఓ ఆపో...ఎప్పుడొస్తిరీ?' అని జవాబినకుండనే పుస్తకాల సంచి ధడేల్మనెత్తేసి గలాసల కల్లొంపుకుని గట్ట గట్ట తాగబట్టిండు.

బడెమ్మ 'గోరెగా, అది ఆపోల్లొచ్చిన్లని తెప్పిచ్చిన గాదు...ఏమో మొదలేసినవ్, మునుంబెట్టిన వంటే ఆగేదే లేదు, తియ్ గలాస్ తీసి కడిగి ఆప కింత, బాయి కింత బొయ్యి మొదాలు' కోపం జేసింది.

'నువ్వేం జేస్తన్నవే, నేనాటకి బోవాలె. అవతల నా దోస్తులు నిలవడ్డరు, నాకు కోడిగుడ్డు ఉడకెయ్యకు, మాడ్సిపెట్టు' అంటూ రోడ్డెమ్మట బడి ఉరికిండు.

'గిసుంట పుల్ల గటు బెట్టరుగని రుచులు గావాలె పోరగాండ్లకు...' తిట్టుకుంట గ్లాసుల నిండ కల్లు తెచ్చింది బడెమ్మ. నేను తాగనన్న. అక్బరేమో నావేపు చూస్తుండు. అబ్బకు చెప్పకు అన్నట్లుందాని చూపు. 'తాగు' అన్న. వాడు రెండు గ్లాసులు తాగిండు. కొద్ది సేపయినంక లేచి నడవబోయిండు గని కాళ్ళు గాల్లో తేల్తున్నయేమో మళ్ళీ మంచం మీదనే వాలిపొయ్యిండు.

అన్నం ఆరుబయట్నే తిని బయట్నే పండినం. మేమొచ్చిన సంతోషాన్కి కల్లు మత్తు తోడై బడెమ్మ ఏదోదో మాట్లాడ్డం మొదలుబెట్టింది. అక్బర్, గోరెమియాలిద్దరూ కల్లు మత్తులో నిద్రలో జోగుతున్రు. కొత్త కొత్తగా ఉండి నాకేమో నిద్ర రాట్లే.

బడెమ్మని గెలికొస్తే చాలా మాట్లాడేట్టు కనబడి చిన్నంగ అడిగిన. 'బడె బాపుతో నీ నిఖా ఎట్లయిందే బడెమ్మా?' అని, కతం, ఇగ మా బడెమ్మ చెప్పుడు షురు చేసింది.

'మా అయ్య రుస్తుం, తెలుసుగ, అమ్మ అంకూసు. మేం మొదాలు రాజోల్ల ఉండేటోల్లం. పూరింట్ల ఉండేటోల్లం. దూదేకి పరుపులు గుట్టేటోల్లం. మొందాలు బాగ అమ్ముడు బోయినయ్. అటెంక గిరాకి తగ్గింది. ఇస్పాంజి పరుపులొచ్చె. ఇగ మా అయ్య సారా అమ్మడం షురూ చేసిండు. రెండర్రలుండేటియి. ఎనక కొద్దిగ సోటుందన్నట్టు. ముందర్రల సారా అమ్మేటోల్లం. మా అమ్మీ సెక్రాలు జేసి సారాల నంజుకుందుకి అమ్మేటందుకు పెట్టేది. మేం నల్గురం అక్క జెల్లెల్లం. పెద్దక్క లాల్‌బీ, నేను, మీ అమ్మి యాకుబ్బీ, గాయెనక సలీంబీ. రోజు మైబ్బాదు బొయ్యి డిపోసార దెచ్చి రాజోల్ల అమ్మేటోడు మా అయ్య. గట్ల గట్ల మా లాలక్కను రైల్వేల పంజేసేటాయనకు ఇచ్చిండు. గప్పుడు శానా పైసలు ఖర్సయినయ్. ఇగ మల్ల నే నెదిగే ఉంటి, మీ అమ్మ ఎదిగే ఉండె, సలీమ గూడ గంతే ఉండె. ఒక్కో ఏడు తేడానే ఉండె మాకు.

అందర్ల యాకుబ్బీ తెల్లంగ సందమామోల్లె ఉండేది. సలీమ గూడ. నేను లాలక్క నల్లగున్న సక్కంగుండెటోల్లం. బారెడు బారెడు ఎంటికలతోని ఏడికన్న బైటకుపోయి యింట్లకు రాంగనే మా అమ్మ దిష్ఠి తీసేడిది' అని ఏదో గుర్తొచ్చినట్లు ఆగి 'ఓ మాదిగోల్ల బుచ్చవ్వ! బువ్వగిట్ల తిన్నరానే, సప్పుడం జేస్తలేరెవ్వలూ?' అనడిగింది.

'ఆ తింటిం బిడ్డా...మీ బుజ్జికి ఏం వండినవ్... కూర దెచ్చినవా?' అన్నదామె.

'కోడిగుడ్ల పుడుం జేసిన గాదు. .కూర దేలే...రేపు దెస్త' అని ఇగామెతో మాటలాపి మల్ల నావేపు తిరిగి 'ఇంటన్నవా బిడ్డా..' అని మొదలు పెట్టింది మల్ల.

'గా సారా డిపో పెద్దాయన ఒకపాలి రాజోలొస్త నన్నడట, కల్లు తాగి నాటుకోళ్ళు పట్కపోనీకి. గట్లని ఒచ్చి యాకుబ్బిని, సలీమానీ జూసి ఆల్ల అన్న కొడుకుల కియ్యాల ఎట్లన్న జేసి అని గామాటే బాపు తోటి అన్నడట..

మా బాపు, మేమేవో దూదేకులోల్లమైతిమి, మీరేమో సాయిబులైతిరి ఎట్ల గుదుర్తదని బయపడ్డడు. గని పిల్లలు సందమావల్లెక్క గొడుతున్నరని వాళ్ళన్నని గూడ ఒప్పించిండు గా సాయిబాయన అంటే మీ సిన్న దాదా అన్నట్లు. మా బాపు గూడ ఒప్పుకున్నడు గని మరి ఆల్లిద్దరి కంటె పెద్ద నేనుంటి గా...అని ముందు నాకు పైగామ్ జూడవట్టిండు. గప్పుడు గీ సన్నాయి వాయించేటోడు కండ్లవడ్డడు మా బాపుకి. దూరం చుట్టరికెం ఉండెనట. ఇగ మీ పెద బాపు కూడ జూసి నన్నే జేస్కుంటనని పట్టుబట్టి నిఖా చేసుకున్నడు. గాల్లదేమో గీ ఉప్పరపల్లి.

ఇగ తర్వాత మీ అమ్మది, సలీమాదీ ఒక్క పాలే అయింది నిఖా. మీ బాపేమో సదు సెప్పేటాయనాయె, మీ సిన్నాయనేమో బేంకిల చేసేటాయనాయె. ఇగ మేమే తక్కువోల్లం అందరకన్నట్లు. ఇగ కాన్సరొచ్చి లాలక్క సచ్చిపోయ్యే. అల్ల పిల్లల పెండ్లిండ్లాయె...మమ్ముల పురాగ మర్సే పోతిరి. ఇంటన్నవా బిడ్డా నువ్వయిన గంతే..గిట్ల పెండ్లీ కాంగనె, గట్ల మరస్తరు' అని కాసేపాగి మల్ల మొదలు పెట్టింది.

'ఇగ జూడరాది నా కష్టాలు మా అత్త బత్కే ఉండె. నా నిఖా అప్పటికి ఎన్ని ఇదాల బాదలు వెట్టాల్నో అన్నిదాల బెట్టింది నన్ను. జడ బారెడున్నదని నూనె శానా అయితదని జుట్టుని గుంజి గుంజి దువ్వి పట్టి పట్టి తెంపేటిది. గట్ల గట్ల మొత్తం ఊసిపొయ్యి ఇగో గీ బోడి తల మిగిలింది. మా సెల్లెళ్ళ ముందు నేను తల్లోల్గె ఉన్నను గని అక్కోల్గె ఏడున్న? పిల్లలు పుడ్తలేరని మీ బడేబాపుకు మల్ల నిఖా చేస్తనని బెదిరించేటిది. గప్పుడే పిల్లబుట్టింది గని ఐదేళ్ళొచ్చినంక రోగమొచ్చి సచ్చె. ఉంటే నా బిడ్డ అచ్చంగ మీ అక్కోలిగే ఉండేటిది. ఇగ శానా రోజులు పిల్లలు పుట్టరని ఏడ్సిన. అటెంక శానా దినాలకు పెంటు గాడు కడుపుల బడ్డడు. గని బయమైతుండె ఏమయితదోనని. గప్పుడందరూ పుట్టంగనే పెంటకుప్పల పారెయ్యిరి, బత్కుతడు అని చెప్తే గట్లనే పారేస్తి...కతం! బతికిండు. మల్ల గోరెగాడు కడ్పుల బడ్డడు. వాన్ని గోరీ మీన పారెయ్యిరి, అన్నరు. గట్లనె గోరీ మీన పారేసి గోరిమియా అని పేరు పెట్టినం. ఈడు గూడా బతికి బట్ట గట్టిండు.

ఇగ మీ బడె బాపు ఎండాకాలంల వాయించబోతడు. కతం బిడ్డా! గా వాయించబోయినపుడు దెచ్చిన పైసలే పైసలు! ఇంగ పైసా సంపాయించడు. మాంచిదనమూ, తాగుడు గావాలె. గా మున్నెల్ల సంపాదన ఎన్నాలొస్తది నువ్వే చెప్పు బిడ్డా! నిఖా అయిన కాణ్ణుంచి ఇప్పటి దాంక సుఖమంటేందో ఎర్కలేకపాయె! నాట్లకు, కలుపుకు, కోతకు బోవుడు...అయినంక పెసలేర, దూదేర, మిర్చేర బోవుడు.. ఏ పని దొర్కితే దానికి బొయ్యి పుట్టెడు పుట్టెడు గింజలు దెచ్చి ఇంట్ల బోస్తుంటె సంసారం నడుస్తుండె. మిర్చేర బోతే మిర్సుస్తుండె తోపులల్ల కాయలేరి పొట్టు దీసి గింజదీస్తె చింత పండొచ్చె. పత్తేరినంక మిర్చేరినంక ఆల్లీల్ల కాల్మొక్కి ఆ కట్టినంత మోపులు గట్టి ఇంట్లేస్తుంటె, ఒక్కోపాలి అల్లుగూడ తిడుతుండ్రు...నీ మొగనీకి తాగెటందుకు మస్తుగ పైసలొస్తయి, కట్టె పుల్లలకు లెవ్వా- అని దెప్పి పొడుస్తుండె లోకం! ఏనాడన్న ఇంట్లెట్ల జర్గుతుంది, పెల్లాం పోరలు ఏం దింటున్రని పట్టించుకున్న పాపాన బోలె మీ బడే బాపు. ఇంకనే నైచ్చిన గింజల్నమ్మి తాగొచ్చి ఒక్కటే లొల్లిచేసుడు! ఒక్క కాలం మమ్ముల సాదితే...రెండు కాలాలు నే సాదాలె అందర్ని. ఉంటాంటే ఒంట్లో సత్తువ లేకుండ అయితాంది. కుండెడు కుండెడు నెత్తురుపోద్ది బయటున్ననంటే..లేసి కూసోనీకే సాతగాదు..గసొంటిది బిగబట్టి బువ్వొండి కూరొండి మల్లనే కూలికి బోవాలె. ఔ బిడ్డా ఇగ వొల్లు బాగా నొప్పి జేస్తది. గీ వయసుల సుత గింత కష్టం జేయాల్సొస్తుండె. గందుకే జర కల్లు బొట్టు తాగితే పానం లేసొస్తది ... జెయ్య బిడ్డా..నా నసీబ్‌ల గిట్లున్నది' అని- ఇంతల ఇంకేదో యాదొచ్చినట్లుంది బడెమ్మకి-

'ఓ మున్నీ..నీకు జెప్పుడు మర్సేపోయిన, జర అమ్మగ్గూడ మర్సిపోకుండ జెప్పు బిడ్డా...గీ మద్దెల పెంటుగానికి సంబంధం జూసినం. మా ఊరి పక్క ఊరే...ఒక్కతె పోరి, ఇద్దరు పోరగాండ్లు. పొల్లగాండ్లు చిన్నోల్లు. పోరి పెద్దది గందుకే పోరి పెండ్లి జెయ్యాల్నని జూస్తున్రం. అల్లూల్లె వాయిచబోయిన్రు గదా. గప్పుడు పెంటుగాన్ని జూసిన్రట. ముద్దుగున్నడని కబురు జేసిన్రు. మంచిదని మేం సుత ఒప్పుకున్నం. పిల్ల పేరు అలీవా! నల్లగున్నా సక్కంగుంది. పనులు సిట్ట సిట్ట జేస్తది. గీ ఈడుల్నే అందర్ని మించి ముందు బోద్దంట నాట్లల్ల , కోతలల్ల! మిగతా అన్ని పన్లు గూడా ఇవరంగ జేస్తదంట బిడ్డా! ఎండలల్ల సుత బీడీ ఆకులు సుడ్తదంట. ఇస్తర్లు గుట్టనీకి దాని మీదికి ఎవలూ రారంట. గంత గుండ్రంగ గుడ్తదట. పోరీ సూత్తే గింత లేదు గని మస్తుగ పన్లు జేస్తది. ఇగ అన్నీ జూసి లగ్గం ఇంగ రెండ్నెల్లకు బెట్టుకున్నం బిడ్డా. పెంటు గాడు గూడా. అయ్య తీర్గనే గిప్పుడే తాగుడు షురూ జేసిండు గాదు. గిసొంటోనికి గదోగిదో పన్జేసి నాల్గు పైసల్దెచ్చేటిదయితేనే ఇద్దరు ఉప్పసం పండకుంట బత్కుతరని జూసి సేత్తున్న బిడ్డా. అమ్మకు జెప్పు...ఎట్లయిన సరె...పద్దినాలు ముందుగ రావాల్నని. ఇగ నువ్వు నెల దినాల ముంద్కె రావాలె. మరదలికి బట్టలు గిట్ల నీకయితే మంచిగ తెలుస్తయి గాదు బిడ్డా..' అని ఆగి 'బిడ్డా శానా మాట్లాడిన గాదూ! నీకు నిద్రొస్తున్నదో ఏమో..ఇగ పండు..' అనుకుంట ఆవలించి నిద్రలోకి జారుకుంది బడెమ్మ.

బడెమ్మ గురించి ఇన్నంక చానా బాధేసింది. మా ఇల్లు గుర్తొచ్చింది.

మా ఇంట్ల అబ్బా నమాజు చేస్తడు. మా అమ్మీకి గూడా నేర్పిండు. మా అమ్మ నిఖాకి ముందు ఊర్ల పక్షోలె తిరిగేడిదేమో! బయటికే రాదిప్పుడు. వచ్చానా బుర్ఖా వేసుకుని రావాల్సిందే. ఇంట్ల అందరం ఉర్దూనె మాట్లాడ్తం. నేనొక్కదాన్ని తెలుగు మీడియం చదవడం మూలాన తెలుగు బాగొచ్చు. మా అబ్బా ఇప్పుడు లెక్చరర్ అయ్యిండు. ఇంక కొన్ని రోజుల్ల ప్రిన్సిపాల్ గూడ అయితడు. వెనకటి ఆస్తి బాగానె ఉండె. మల్ల ఈయన సంపాదన!

(మిగతా 13వ పేజిలో)

పెద్దల నిర్లక్ష్యంతో పిల్లలకు అంగవైకల్యం

చిన్న పిల్లల ఆహారంలో పాలు, గుడ్లు, పప్పులు, ఆకు కూరలు సమృద్ధిగా ఉంటే, వాళ్ళ ఎముకల పుష్టికి అవసరమైన కాల్షియం, భాస్వరం, విటమిన్-డి బాగా లభించి, ఎముకలు ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఎముకల పెరుగుదల సరిగ్గా లేకపోతే ఎదుగుదలా సరిగ్గా ఉండదు. క్రమ పద్ధతిలో ఎముకలు పెరగకపోతే వికలాంగులు కావచ్చు. రకరకాల ఇన్‌ఫెక్షన్స్ వల్ల ఎముకల్లో అనారోగ్యం ప్రారంభమై ప్రాణం తీయవచ్చు. కాల్షియం కార్బొనేట్, ఫాస్ఫేట్ పిల్లల ఎముకల్లో తక్కువగా ఉంటాయి. అందువల్ల పిల్లల ఎముకలు అంత గట్టిగా ఎముకలలో కాల్షియమ్ లవణాలతో తయారైన సాంద్ర పదార్థం ఎముకలు గట్టిగా, కొద్దిగా స్థిత స్థాపకత కలిగి ఉండేట్లు చేస్తుంది. వయసు పెరిగేకొద్దీ వృద్ధులలో ఈ పదార్థం తగ్గుతుంది. అందుకే వృద్ధాప్యంలో ఎముకలు బాగా పెళుసై పుటుక్కున విరిగిపోతుంటాయి.

గర్భంలో శిశువుకు రెండవ నెల వచ్చినప్పటి నుంచి, ఎముకలు పెరగడం ప్రారంభించి - ఆడవాళ్ళలో అయితే పదహారేళ్ళ వరకూ, మగవాళ్ళలో అయితే పద్దెనిమిదేళ్ళ వరకూ పెరుగుతాయి. ఉరఃపంజరంలోని ఎముకలు గట్టి పడటం ఇరవై అయిదు సంవత్సరాల వరకు జరుగుతుంది. ఎముకల మీద బలానికి కాల్షియమ్ పొరలుగా ఏర్పడటం ముప్పై అయిదు సంవత్సరాల వరకు జరుగుతుంది.

''గర్భస్థ శిశువులో ఎముకలు రెండు విధాలుగా ఏర్పడతాయి. మెత్తటి కణజాలంతో పుర్రె ఎముకలు పెరగడం ప్రారంభిస్తాయి. ఎముకలలో చాలా భాగం మొదట కార్టిలేజ్ బోన్స్ గానే ఏర్పడతాయి. ఆ తర్వాత వచ్చే వాటి స్థానంలో శాశ్వత ఎముకలు లాగానే ఇవి ఉంటాయి. పుట్టే లోపు పూర్తి ఆకారం ఏర్పడేలా పెరగడానికి ఇవి అనువుగా ఉంటాయి. క్రమంగా ఈ కార్టిలేజ్ బోన్స్ స్థానంలో మామూలు గట్టి ఎముకలు వస్తాయి. పొడవాటి ఎముకలలో ఈ గట్టి పడటం, మధ్యలోను, చివర్ల నుంచి ప్రారంభమవుతాయి'' అంటూ వివరించారు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆర్థోపెడిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. దశరథ రామిరెడ్డి.

ఎక్స్‌రే ద్వారా ఎముకల మీద గ్రోత్ ప్లేట్స్ మందాన్ని చూసి, ఆ ఎముకల వయసుని అంచనా కట్టవచ్చు. ఒకళ్ళ నుంచి మరొకళ్ళకు ఈ ఎముకలు పెరిగే విధానంలో మార్పు వుంటుంది.

చాలా ఎముకలు రెండు రకాల కణాలతో నిర్మితమవుతాయి. గట్టి కణాలు బయటి వైపు, స్పాంజి లాంటి మెత్తటి కణాలు లోపలి వైపు వుంటాయి. తొడలలోని ఎముకకు పైన గట్టి కణజాల ముంటుంది. లోపల డొల్లగా ఉంటుంది. అందులో పసుపుపచ్చని మారో ఉంటుంది. లోపల ఉండే స్పాంజ్‌లో ఎరుపు మారో ఉంటుంది. ఇది రక్త కణాల్ని తయారు చేస్తుంది. అన్ని ఎముకల మీదా ఫెరియాస్టిమ్ అనే పొర ఉంటుంది. పైన ఉన్న గట్టి కణజాలం లోంచి లోపలకు రక్త నాళాలు, నరాలు వెళ్తుంటాయి.

కొత్త కణాలు ఏర్పడగానే, వాటి చుట్టూ మ్యాట్రిక్స్‌లా ప్రత్యేక జంతు సంబంధ పదార్థం ఏర్పడుతుంది. దీని మీద కాల్షియం పొరగా ఏర్పడి ఎముకలు గట్టి పడతాయి. ఎముకలు కలిసే స్థలం కీలు లిగమెంట్స్ అనే ఫైబ్రస్ బాండ్స్‌తోఈ ఎముకలు కలుపబడతాయి. కదలికకు అనకూలంగా ఉండడానికని ఎముకల చివరలు కార్టిలేజ్‌తో కప్పబడి ఉంటాయి. ఎముకల మధ్య కందెనలా పనిచేసే నూనెను సృష్టించడంతో పాటు కార్టిలేజ్‌కి ఆహారాన్ని సరఫరా చేయడానికి రెండు ఎముకలు కలిసే చోట 'సినోవియమ్' అనే పొర వుంటుంది. మన శరీరంలో- భుజాల్లో మోచేయి దగ్గర, మణికట్టు దగ్గర, తుంటిలో, మోకాళ్ళలో, మడమల్లో, దవడల్లో పెద్ద కీళ్ళు- చేతులు, పాదాలు, వెన్నెముకలలో చిన్న చిన్న కీళ్ళు ఉంటాయి. ఒక్కో కీలుది ఒక్కో రకం చలనం.

మామూలుగా కీళ్ళ దగ్గర నొప్పి, వాపు, పట్టేయడాన్ని 'ఆర్థ్రయిటిస్' అంటారు. వాస్తవానికి కీళ్ళ ఇన్‌ఫ్లమేషనే - ఆర్థ్రయిటిస్. 'రుమాటిజమ్' అంటే కండరాలు, ఎముకలు, కీళ్ళు, టెండాన్స్ బిగుసుకుపోయి నొప్పి పుట్టడం!

ఆర్థ్రయిటిస్‌ని రెండు రకాలుగా విభజింపవచ్చు.

మొదటి రకం ఆర్థ్రయిటిస్- మామూలుగా నలభై సంవత్సరాలకు పైబడ్డ వాళ్ళలో, కీళ్ళు అరిగిపోయి కలిగే అనారోగ్యం. దీనికే 'ఆస్టియో ఆర్థ్రయిటిస్' అంటారు. కండరాలకి వచ్చే ఆర్థ్రయిటిస్ 'రుమటైడ్ ఆర్థ్రయిస్'. ఇది ఆడవాళ్ళలో ఎక్కువగా వస్తుంటుంది. ఏ వయసు వాళ్ళకైనా రుమటైడ్ ఆర్థ్రయిటిస్ రావచ్చు.

''కీళ్ళలో ఎదురెదురు ఎముకల మధ్య రాపిడి కలగకుండా కదలిక బాగా ఉండడానికి ఉండే కార్టిలేజ్ పొర దెబ్బతినడంతో ఆస్టియో ఆర్థ్రయిటిస్ ప్రారంభమవుతుంది. దీనివల్ల కీళ్ళ దగ్గర కదలికకు కొద్దిగా అంతరాయం కలుగుతుంది. నొప్పి ప్రారంభమవుతుంది. కదలికలవల్ల దెబ్బతిన్న ఎముకల దగ్గర ఎముక ముక్కలు పెరిగి చుట్టు పక్కల నరాల మీద ఒత్తిడి కలిగించి, నొప్పిని పెంచుతాయి. నొప్పి, వాపు, కీళ్ళ బిరుసుతనంతో ఈ వ్యాధిని పసిగట్టవచ్చు. క్రమంగా నిద్ర కూడా సరిగా పట్టదు. మోకాళ్ళ దగ్గర ఆస్టియో ఆర్థ్రయిటిస్ వస్తే నడవడం కూడా కష్టం. వెన్నెముకలో వస్తే వంగి లేవడం కష్టమవుతుంది. ఆస్టియో ఆర్థ్రయిటిస్ ఒక కాలులో వచ్చి రెండో కాలులో లేకపోవచ్చు. రుమెటైడ్ ఆర్థ్రయిటిస్ అయితే చాలా చోట్ల వ్యాపిస్తుంది. ఇది ఆస్టియో ఆర్థ్రయిటిస్ కన్నా వేగంగా వ్యాపిస్తుంది. బరువు ఎక్కువగా పడే అవయవాలలో ఆర్థ్రయిటిస్ ఎక్కువగా వస్తుంది. స్థూల కాయులలోను, నలభై ఏళ్ళ వయసు దాటిన వాళ్ళ లోను ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంటుంది.

''ఇక రెండవ రకం - ఇన్‌ఫెక్టివ్ ఆర్థ్రయిటిస్. కీళ్ళకి చీము పట్టడంతో ఈ వ్యాధి రావచ్చు. దీనికే సెప్టిక్ ఆర్థ్రయిటిస్ అంటారు. ఇది ఏ వయసులో నయినా రావచ్చు. ముఖ్యంగా చిన్న పిల్లల్లో వస్తే దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందంటున్నారు డాక్టర్ దశరథ రామిరెడ్డి.

'సెప్టిక్ ఆర్థ్రయిటిస్ అంటే ఏమిటో వివరిస్తూ 'శరీరంలో ఎక్కడ సెప్టిక్ అయి చీము ఏర్పడ్డా - అది రక్తం ద్వారా శరీరంలోని ఇతర భాగాలకూ చేరవచ్చు. ముఖ్యంగా తుంటి దగ్గర చేరి 'ఆర్థ్రయిటిస్' రావచ్చు. దీనినే సెప్టిక్ ఆర్థ్రయిటిస్' అంటారు. చిన్న పిల్లలకు రెండు సంవత్సరాల ప్రాయంలో రావచ్చు. టి.బి. లేకపోతే ఇతర రకాల బాక్టీరియా ఈ వ్యాధి రావడానికి కారణం.

ఈ వ్యాధి లక్షణాల గురించి వివరిస్తూ- 'జ్వరం చాలా ఎక్కువగా వస్తుంది. నడక ఇబ్బంది అయి, కాళ్ళు నొప్పులు పుడుతుంటాయి. ముఖ్యంగా జాయింట్స్ దగ్గర నొప్పి, ఉబ్బు కలుగుతాయి. ఇన్‌ఫెక్షన్ శరీరంలో ఏ భాగంలో ఉన్నా ఇలా జాయింట్స్‌లోకి జారి హఠాత్తుగా ఆర్థ్రయిటిస్ వస్తుంది. అప్పుడు వెంటనే చికిత్స అవసరం. రక్త పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ ద్వారా ఈ ఇన్‌ఫెక్షన్‌ని తెలుసుకోవచ్చు. ఐసోటో బోన్ స్కాన్ కూడా అవసరమవుతుంది. తల్లిదండ్రులు వెంటనే గమనించి, సరైన చికిత్స ఇప్పించకపోతే ఒక్క రోజు చాలు పిల్లల జాయింట్ నాశనమవ్వడానికి. బాక్టీరియా వల్ల చీము ఏర్పడి, తుంటి కీలు కార్టిలేజ్ దెబ్బ తింటుంది. కాబట్టి పిల్లల్లో ఎక్కడ ఇన్‌ఫెక్షన్ ఉన్నా అశ్రద్ధ చేయకూడదు. తుంటిలో ఈ ఇన్‌ఫెక్షన్ వస్తే ఫిమోరల్ హెడ్ కూడా దెబ్బతింటుంది. ఫిమోరల్ హెడ్‌కి, 'బోని యాంక్యులోసిస్' కలుగుతుంది. కదలికలు లేక కాళ్ళు స్టిఫ్ అవుతాయి. చిన్న పిల్లల విషయంలో చూపించిన ఈ చిన్న అశ్రద్ధ వాళ్ళని జీవితాంతం అవిటి వాళ్ళను చేస్తుంది' అని చెప్పారు డాక్టర్ దశరథరామి రెడ్డి. మొదటి దశలోనే ఈ వ్యాధిని కనుక్కోవడం వల్ల జరగబోయే అరిష్టాలను అరికట్టవచ్చంటున్నారాయన.

'అదొక్కటే మార్గం. బాగా జ్వరం, జాయింట్లలో నొప్పి, నిలబడలేక పోవడం...వంటి లక్షణాలు పిల్లల్లో కన్పిస్తే వెంటనే వైద్యుని దగ్గరకు తీసుకువెళ్ళాలి. కాస్త ఆలస్యం చేసినా ఆ పిల్లవాడు జీవితాంతం కష్టపడతాడు. ఈ వ్యాధి పిల్లల జీవితాన్ని నాశనం చేయడానికి 24 గంటలు చాలు. డాక్టర్ ఇలాంటి పిల్లల్ని పరీక్ష చేసి సెప్టిక్ ఆర్థ్రయిటిస్ అనే అనుమానం వస్తే 'సి-ఆర్మ్'తో జాయింట్‌ని చూస్తారు. చీము ఉంటే వైడ్‌బోర్ నీడిల్‌తో తీసి, అనాలసిస్‌కి పంపుతారు. చీము తక్కువ ఉంటే యాంటిబయాటిక్స్ వాలి. ఎక్కువ ఉంటే 'ఆర్థ్రాటమి' అనే శస్త్ర చిక్సిత్స చేసి- జాయింట్‌ని ఓపెన్ చేసి శుభ్ర పరుస్తారు. కాబట్టి అలక్ష్యం చేస్తే కార్టిలేజ్ దెబ్బ తినడమే కాకుండా తుంటి ఎముకలో అయితే ఫిమోరల్ హెడ్ కూడా దెబ్బ తింటుంది. దీనివల్ల కాలు పొట్టిది అవడమే కాక, జాయింట్ కదలికలు లేకుండా పోతుంది. ఇన్‌ఫెక్షన్ బోన్స్‌కి వ్యాపించకూడదు. అలా బోన్స్‌కి వచ్చిన ఇన్‌ఫెక్షన్ జీవితాంతం నయం కాకపోవచ్చు. ఎక్కువ కాలం ఈ ఎన్‌ఫెక్షన్ ఉండటం వల్ల కీలుని మార్చి మరో కొత్త కీలుని అమర్చడానికీ వీలుండదు. ఎందుకంటే కీళ్ళలో ఒకసారి ఇన్‌ఫెక్షన్ వస్తే ఒక పట్టాన తగ్గదు. అటువంటప్పుడు మరో కొత్త కీలుని జాయింట్ దగ్గర అమర్చినా దానికీ ఇన్‌ఫెక్షన్ రాదన్న భరోసా లేదు. అందుకని పిల్లల్లో ఎక్కడ ఇన్‌ఫెక్షన్ ప్రారంభమై, చీము ఏర్పడ్డా -వెంటనే చికిత్స చేయించాలి. లేకపోతే అది క్రమంగా 'సెప్టిక్ ఆర్థ్రయిటిస్'లోకి దారితీసే ప్రమాదం వుంది' అంటూ డాక్టర్ దశరథ రామిరెడ్డి హెచ్చరించారు.

-వేదగిరి రాంబాబు

12వ పేజీ తరువాయి

సిర్ సిరా

ప్రతిరోజూ మటనో, చికనో లేంది ముదెత్తడు. రెండంతస్థుల బంగ్లా మాది. కింద మేముండి పైన కిరాయికిస్తం. అప్పుడప్పుడు అమ్మ మీద కోపమొచ్చినపుడు 'దూదేకుల్దానా' అని తిడగాడు అమ్మీని. నా మీద కోపమొస్తే 'అన్నీ అమ్మ పోలకలే దీనికి' అని నన్నూ తిడతడు. భాయిని, ఆపాని బాగా చూస్తడు. వాళ్ళకన్నీ నవాబు శెకలే... మామూలు బట్టలు వెయ్యనే వెయ్యరు. మా ఆపా అయితే గంటసేపు తయారు గాంది బయటకే పోదు. నేనేమో బట్టలు నలిగినా సరే చినిగినా సరే... ఎవరి ముందుకైనా ఊరికె పొయ్యి మాట్లాడ్త. ఆ తర్వాత అబ్బాతో 'లేకి బుద్దులని' తిట్లు పడత! అసలు లేకితనం ఎక్కణ్ణిచ్చిందో... లేమితనం లోంచా! బడెమ్మ నిద్రలో మూలుగుతున్నట్లుంది... మళ్ళీ ఆలోచన్లు ఇటు మళ్ళినయ్...

దిగులుగా ఆ రాత్రి తెల్లారింది.

తెల్లారి నే లేసేటప్పటికే బడెబాపు, పెంటుగాడు ఇద్దరూ పొయ్యి పైన్నే పొయ్యి పక్కన కూసుండి చాయ్ తాగుతున్రు. పొయ్యి కాణ్నె సూరుకు రెండు ఎండు తున్కల దండ్యాలు ఏలాడుతున్నయ్.

'పెద బాపూ! బాగున్నవానే' అన్న.

'బాగున్నం బిడ్డా. ఎన్నాల్లకొచ్చినవ్. మీ బాపు, అమ్మ గిట్ల రాకపోతిరి. అల్లు సూతొస్తే బాగుండు' అని చాయ్ గ్లాసు పక్కన బెట్టి..... 'గిప్పుడె జర చెరువు కాడికి పోయొస్త' అనుకంట బైటికెల్లిండు.

'చాపలు తేనీకి బోతున్నడు, తేనయితే తెస్తడు గాని పుల్లుగ పట్టించొస్తడు. ఇగసూడు ఒక లొల్లా ఒక ఆగమా..మొత్తం ఈది ఈదంతా ఒక్క తాన దెస్తడు. ఇగ జూద్దూ ఆగు మీ బడె బాపు ఈరంగం' అని నిట్టూర్చుకుంట గ్లాసులు కడిగి ఇంట్ల బెట్టింది బడెమ్మ.

మూడు గంటలయితుంటే చేపలొక చేత్తో ఇంకో చేతుల తువ్వాలు పట్టుకొని ఊక్కుంట వచ్చిండు బడె బాపు.

'కరీంబీ..కరీంబీ...ఓర్నీయవ్వ పిల్తుంటే సెవ్వులినబడ్తలేదా ఏం జేస్తున్నవే..మాధేరీకి..ఇగో సేపలు...మంచిగ వండాలే...పులుసు నాల్క మీదెయ్యంగనే...సొర్గం ఔపడాల...నేను గిక్కడ్నే గిక్కడ్నె పనుండి పోతున్న..వచ్చేటాలికి పుల్సు రెడీగా ఉండాలే...

నీయమ్మ..సెప్పింది సెవులబెట్టవ్...' అనుకుంట మల్ల బజారు పొంటి పోబట్టిండు!

'ఓరి నిన్ను మైసమ్మ దిన ...నీ కాలు చెయ్యి ఇరిగిపోన ఎ..నిన్నెప్పుడ ఎ మోస్కబోతరో....మంచోల్ల కొత్తంది సావు...' అని మెల్లగ అని 'ఇప్పట్కే సోలుతుండవు...ఓరి తలత్తయ్యా...సాలుగని రారో...' అని కేకబెట్టింది బడెమ్మ.

ఏం ఇనబడేటట్లు లేదు. గట్లనే నడ్సుకుంట సారా దుక్నం కాడికి మల్ల బొయ్యిండు బడె బాపు.

చాపల కూర మస్తుగ వండింది బడెమ్మ. వస్తె ఏం లొల్లి పెడతడోనని తొందర్గ అందర్కి అన్నం బెట్టి తాను గూడ రెండు బుక్కలు తిన్నది బడెమ్మ.

ఎనిమిదయితుండె. ఇంకా బాగా సోలుక్కుంట కిందబడుకుంట, లేస్కుంటొచ్చిండు బడె బాపు. బట్టలెటు పోతున్నయో సోఁయే లేదు వచ్చీ రాంగనే...

'కరీంబీ..కరీం..బువ్వ బెట్టు..' అన్నడు. బడెమ్మ ప్లేట్ల అన్నం, మంచి నీళ్ళు, పులుసు బెట్టి 'రావు., గీడ బెట్టినా' అన్నది. గట్లనే సొలుక్కుంట వచ్చి పడేటోడె. బడెమ్మ పుట్టుకొని సరిగ్గా కూసోబెట్టింది. 'అన్నం కలుపుడె వస్తలేదు. 'కరీవా..నువే తినిపియ్యాహె..' అన్నడు. బడెమ్మ నోట్లో తిట్టుకుంట ముద్దలు గలిపి పెట్టవట్టింది.

'ఏవో..తిట్ట వట్టినవ్..సరిగ్గా జూసిపెట్టు..కొంటలు వెట్టి సంపుదమనుకుంటున్నవ్...నాకు దెల్వదా..నేన్ సావంగానె.. తైయ్యిన ఎగుర్దమనా..? నీ ఆటలేం సాగయి. హమ్మ, నువ్వు తక్వ దానివి గాదు...నన్ను సంపిపార నూకుదామనే జూస్తున్నవ్ గని.... నీ మెండడి సొమ్మేమన్నా బెడ్తున్నావా... మీ అయ్యిచ్చిన సొమ్మేవన్న బెడ్తున్నవా... నీయమ్మ నన్ను సావనూకి తలకు చేసుకోవాల్నని సూత్తన్నవ్ గన...' బడెబ్బ ఆగుతనే లేవు.

బడెమ్మ కోపం నసాళానికంటుకుంది. 'ఏందో మా అయ్యొంట అమ్మొంట బడ్డవ్, నీ సొమ్మేం తింటున్న లేరాదా...నీ దెస్తే ఏవన్న దింటున్నావ్ పిలగానివి! దినావూ తాగనీకీ, తిననీకీ ఏణ్ణుంచొస్తున్నాయో... నీ అయ్య బెడుతుండా..! నువ్వు గినక సంపాయిస్తున్నవ్ గని దునియాల. ఎవలన్న సంపాయిసు న్నారవా!..! థూ...ఎధవ జల్మ..' బడెమ్మ పళ్ళెం తీసి గాబు దగ్గరకు పోయింది కడక్కరాను.



'నీ లం-దానా...నిన్ను గాడ్దులు...! మా అయ్యనంటా వానే..దేవుడసొంటోడు మా అయ్య! నాకు అమ్మురుతం రుచి సూయించిండే. మా అయ్య. మా అయ్యంటే ఎవలనుకుం టన్నవ్.. దేవుడు...'మాటలు తడబడు తున్నయ్ బడె బాపుకు.

'మాయదారి సారాని మీ అయ్య బోసిండు గాబట్నే ఇట్టుంది సంసారం! అయిన గాని తాగుబోతునని జేసినోడు దేవుడెట్టా అయిండో..? ముదనష్టపు అయ్య..ఆడి కడుపుల బుట్టిన పెద్ద ముదనష్టపోడివి నువ్వు..' తిట్లకు లంకించుకుంది బడెమ్మ.

'నీయమ్మ..నీకెన్ని సార్ల జెప్పాల్నె..? మా అయ్యని ముదనష్టపో డంటావా..?' లేచి ఊక్కుంటనే రోకలిబండ ఎన్క నుంచి దనాదన రెండు బాదిండు బడె బాపు!

'ఓర్నాయనో..సస్తిన్రో..నీ కడుపు మాడ..నిన్ను బొందబెట్టి రాను..నీ దినం జెయ్య.,నీ చేతులు జెట్టబుట్ట..' ఘొల్లున మొత్తుకుంట అటు ఇటు తప్పుకుంటున్నది బడెమ్మ. ఇంక ఏడబడితె ఆడ బాదుతనె ఉన్నడు సొలుక్కుంట, తిట్టుకుంట..నేను లేచి ఎంతడ్డం పోయనా ఆగబట్టలేకపోతుంటి. గొరెగాడు పెద్దగ ఏడ్వ బట్టిండు. పెంటుగాడన్న ఇంట్ల లేడు. ఆ లొల్లికి, అళ్ళిద్దరి అర్సులకు చుట్టువక్కల ఇండ్లోళ్ళం దరూ ఉరుక్కుంట వచ్చి న్రు. బడెబాపు రెక్కలు బట్టి బయటికీడ్సుక పోయిన్రు.

'బాంచోత్..గిప్పుడంటే ఈ లందరొ చ్చిన్రు..ఎప్పటికైన నిన్ను పానాల్తో ఇడ్సి పెట్టనే ఏమనుకుంటున్నవ్ నన్ను.. నీయమ్మ...'' గట్టిగా అర్సుకుంట ...తన రెక్క పట్టుకున్న మాదిగోల్ల ఈరయ్యను విదుల్చుకుని తూలుకుంట ఎక్కడికి పోయిండో బడెబాపు.

ఆడోళ్ళందరూ కల్సి బడెమ్మని మంచం మీద పడుకోబెట్టిన్రు. చెయ్యికి బాగా తగిల్నట్టుంది. ఇంతెత్తున వాపొచ్చింది. మూల్గుతుంది బడెమ్మ. మూల్గుల్లోనే కలగలిపి ఏడ్వబట్టింది. అందరూ బడెమ్మని ఊకోబెట్టబట్టిన్రు. మెల్లమెల్లంగ అందరు పోయినంక ఎప్పటికో నిద్రపట్టింది బడెమ్మకు. నాకు కళ్ళు మూసినా తెర్సినా బడెబాపు చేసిన వీరంగమే కనబడబట్టింది. మా తమ్ముడైతె భయంతోని మంచానికి కర్సుకపోయిండు.

తెల్లారేమేం ఎల్లే రోజు. బడెమ్మ కుడి చేయి బుజం రాత్రి కంటె గూడా ఎక్కువ వాపుకొచ్చింది. నాకైతే ఇరిగిందనే అనుమానం. గామాటే వందమార్లు చెప్పిన బడెమ్మతో. ఆస్పత్రిలో చూయించు కొమ్మని. 'దీనికేమయిద్ది బిడ్డా.. ఇంత కంటె పెద్ద దెబ్బలే, కొట్ట గూడని సోసోట్ల కొట్టినా గూడా తిప్పుకుని మొండి బత్కు బతుకుతున్న గాదూ! మీ బడె బాపు సూత మంచిగనె ఉంటడు గని గా సార తాగినప్పుడే సిందులేస్తడు' అనుకుంట లోపల్కి బోయి చేతుల మూడు వంద నోట్లు పట్టుకొచ్చి కాల్లు మొక్కి...'మిడ్డా..గరీబోల్లం గాదు. నువ్వు గంత దూరం నుంచొత్తే ఏం కొనే ఈలే లేకపాయె! అయినా ఈడ ఏం మంచిగుంటయిలే గని... ఆడ్నే ఏదన్న కొనుక్కో బిడ్డా! గీ లొల్లులు ఎప్పట్కీ నే సచ్చిందాక ఉండేటియే గని నువ్వు మన్సులో ఉంచుకోకు బిడ్డా! ఏందో గరీబుదాన్ని గిది ఉంది గిదే పెట్టినా...మొదటి సారొత్తే గిదేనా సూసుడనుకోకు, పెంటు గాని నిఖాకి మంచి చీర దెస్త..' అని ఎంత వద్దన్నా ఇనకుండా నా చేతుల పెట్టి ఎడం చేత్తో సూట్‌కేస్ పట్టుకుంది బడెమ్మ. నే పట్టుకుంటనని తీసుకున్నా గుంజుకుంది. ఆటో ఎక్కియ్యనీకి రోడ్డు దాంక వచ్చింది.

మేం రోడ్డు కాడికి పొయ్యేసరికి ఆటో వచ్చింది. ఎక్కి కూసున్నం. 'అమ్మకు, అబ్బకు, ఆపకు బాయికి గిట్ల సలాం చెప్పు మున్నీ! మర్చిపోకు, అందరు పెండ్లికి రావాల్నని జెప్పు. ఇగ నేనుంటున్న...' బడెమ్మ కళ్ళల్ల నీళ్ళు తిరిగినయ్. ఆటో కనబడినంత సేపు బడెమ్మ చెయ్యూపుతనే ఉంది. నా కళ్ళెమ్మటి గూడ నీళ్ళు టపటప రాలబట్టినయ్...!

వచ్చేవారం కథ

ఎచటికి పోతావీ రాత్రి?

- పి. సత్యవతి